కథ

కె.యస్.ఇందిరాప్రియదర్శిని

# ప్రేమ మంత్రం

ఆరోజు బజారుకు వెళ్లి వస్తూ యథాలాపంగా ఒక షాపులో ఒక మాసపత్రికను చూసింది ప్రణయ. షిర్డీ శ్రీసాయి బాబా ముఖచిత్రాన్ని చూడగానే వెంటనే ఆ పత్రికను కొనుక్కుంది. ఇంటికి రాగానే అన్ని పనులూ ముగించుకొని, మధ్యాహ్నం భోజనం చేసి, మంచంపై పడుకుని కొత్తగా తెచ్చిన పత్రిక పేజీలు తిరగేయసాగింది. ప్రణయకు సాయిబాబా అంటే విపరీతమైన భక్తి. ఆమె అనుకున్నట్టు ఆ పత్రికలో సాయిబాబా గురించిన విశేషాలేవీ లేవు గానీ ఒక పేజీని చూడగానే ప్రణయ కుతూహలంగా లేచి కూర్చుంది. 'వశీకరణ మంత్రం' అన్న శీర్షికను చూడగానే దాన్ని ఉత్సాహంగా చదవడం ప్రారంభించింది.

అందులో ఏదో ఒక మంత్రాన్ని ఇచ్చారు. ఆ మంత్రాన్ని ఎలా ఉపయోగించాలి అన్న వివరణ కూడా ఉంది అందులో. ప్రణయ చిన్నతనం నుండీ కూడా వాళ్ల ఇంటిలో ఆమె తల్లిదే పైచేయి. తండ్రి తన తల్లి మాటను ఎప్పుడూ కాదనలేదు. ముఖ్యమైన ఏ విషయంలోనూ తండ్రి వేరే అభిప్రాయం వెలిబుచ్చినా, తల్లి ఇష్టప్రకారమే జరిగేదే తప్ప ఆయన మాట నెగ్గేది కాదు. దీనివలన నాన్నమ్మా, అత్తయ్యలూ అప్పుడప్పుడూ తల్లితో గొడవ పడేవారు. అయినా తల్లి లక్ష్యపెట్టేది కాదు. వాళ్లు నాన్నతో పోట్లాడితే ఆయన వాళ్లకే నచ్చజెప్పేవాడు. కాదంటే మాటా, మంతీ లేకుండా మౌనంగా ఉండిపోయేవాడు. దాంతో విసిగిపోయిన వాళ్లు "వాడికి ఏదో మంత్రం వేసి వాడిని లొంగదీసుకుంది. లేకుంటే ఇలా పెళ్లాం మాటకు ఎదురుచెప్పడానికే భయపడతాడా!" అని తల్లికి వెనుక మాట్లాడుకోవడం ఎన్నోసార్లు వింది ప్రణయ. "ఒక మంత్రంతో ఇతరులను వశపరచుకొని తమ ఇష్టం ప్రకారం నడిపించగలగడం సాధ్యమా?" అని ఆశ్చర్యపోయేది. అయితే ఎప్పుడూ ఏ విషయంలోనూ గొడవ పెట్టుకోక తల్లి మాటకే విలువనిచ్చే తండ్రినీ, ఏ విధమైన కోపతాపాలూ ప్రదర్శించకనే తన మాట నెగ్గించుకునే తల్లినీ చూస్తున్నకొద్దీ నిజంగా అలాంటి మంత్రాలు ఉన్నాయేమో అన్న సందేహమూ కలిగేది కానీ అప్పటికింకా పెళ్లికాని పిల్లే కనుక దాని గురించి పెద్దగా ఆలోచించేది కాదు.

ఇప్పుడు ప్రణయకు సురేంద్రతో వివాహమై ఆరు నెలలే అయింది. కాపురానికి వచ్చి మూడు నెలలే. మామగారు లేరు. అత్తగారూ, ఇద్దరు ఆడబడుచులూ మంచివాళ్లే. పాపం! ప్రణయను ఏ విషయంలోనూ తప్పుపట్టేవారు కాదు. చిన్న చిన్న పనులు మాత్రం ఆమెకు చెప్పి చేయించుకునేవాళ్లే కానీ మిగిలిన పనంతా వాళ్లే చేసుకునేవాళ్లు. సురేంద్ర కూడా భార్యతో సఖ్యంగానే ఉండేవాడు. అయితే అప్పుడప్పుడు తల్లిని మందలించేవాడు, కోడలిని మరీ నెత్తికెక్కించుకోవద్దని.

చదువుకుంటున్న చెల్లెళ్లిద్దరూ ఎప్పుడూ ఆ పనీ, ఈ పనీ చేస్తూంటే వాళ్ల చదువులు పాడవుతాయని కోప్పడేవాడు. చాటుగా కాదు, బాహాటంగానే చెప్పేవాడు. ప్రణయతోనూ మంచిగానే "నువ్వు ఈ ఇంటి కోడలివి. అన్ని పనుల్లోనూ నువ్వూ పాల్పంచుకోవాలి. అమ్మకు వయస్సు పైబడింది కదా! ఆమెకు ఇప్పుడైనా కాస్త విశ్రాంతినివ్వడం మన బాధ్యత" అనే వాడు.

తనూ చిన్నా చితకా పనులు చేస్తూనే ఉన్నా, తానేదో రాణివాసం అనుభవిస్తున్నట్టు భర్త అలా మాట్లాడటం ప్రణయకు కొంచెం బాధ కలిగించినా, పెళ్లయిన కొత్త కాబట్టి ఎదురు మాటాడేది కాదు. ఎప్పుడైనా తల్లి వచ్చినప్పుడు ఆమెతో చెప్పి బాధపడేది. "కొత్త కాపురమన్నాక అలాగే ఉంటుంది. అనవసరంగా అపోహలు పెంచుకొని గొడవలు పెట్టుకోవద్దు సుమా!" అని ఆమె బుద్ధి చెప్పినప్పుడు ప్రణయకు ఆశ్చర్యం వేసింది. 'తల్లి నిజంగానే ఏదో మంత్రం వేసి తండ్రిని వశపరచుకొని ఉండి ఉంటే తనకూ నేర్పేది కాదా! ఏ తల్లి మాత్రం కూతురి బాగు కోరుకోదు గనుక! కాబట్టి అలాంటి మంత్రాలు ఏవీ ఉండి ఉండవు' అనుకుంది. ఆ తరువాత ఆ విషయం గురించి ఆలోచించలేదు.

అలాంటిది ఇప్పుడు ఆ పత్రికలో మంత్రం గురించి చదివాక "నిజంగా ఇలాంటి మంత్రాలు లేకపోతే ఇలా రాయరు కదా!" అని అనుమానం వచ్చింది. నిదానంగా చదివింది. మంత్రమూ, దాన్ని ఎన్ని రోజులు, ఎన్నిమార్లు జపించాలో, ఇంకా పాటించవలసిన నియమాలూ అన్నీ వివరంగా ఉన్నాయి. ఆచరణలో పెట్టాలంటే కష్టమే. అంత జాగ్రత్తగా అందులో చెప్పినవన్నీ ఎవరూ చేయలేరు అనుకుంది. అయినా తాను మాత్రం తప్పనిసరిగా చేసి చూడాలని నిశ్చయించుకుంది.

నిశ్చయం చేసుకోవడమే కాదు. మరుసటి రోజు నుండి ఆచరణలోనూ పెట్టింది. పదకొండు రోజుల పాటు ఉదయాన్నే ఎవరూ లేవక మునుపే లేచి పూజ చేసి ఆ పత్రికలో రాసిన విధంగా చేయడం ప్రారంభించింది. మొదట సురేంద్రతో సహా ఇంట్లో అందరూ, ఆమె ఉదయాన్నే లేచి ఏం చేస్తుందా అని ఆశ్చర్యపోయినా 'మనకెందుకులే' అని ఊరకుండిపోయారు. పదకొండు రోజులూ అయ్యాక చివరన చేయవలసిన పూజలూ, అవీ కూడా పూర్తిచేసింది ప్రణయ.

* * *

మంత్రాలతోనూ, మందూ మాకూ పెట్టి భర్తను తనకు పాదాక్రాంతునిగా చేసుకోవాలన్న చెడు కోరిక లేదు ప్రణయకు. నిజంగా ఇది ఫలిస్తే సురేంద్ర తనను ఇంకా ఎక్కువగా ప్రేమిస్తాడనీ, ఫలితంగా తమ కాపురంలో ఎలాంటి ఒడిదుడుకులూ రావనీ అమాయకంగా ఆలోచించింది ఆమె.

సురేంద్రలో క్రమంగా అన్ని రోజులు లేని మార్పు చోటుచేసుకోవడం గమనించి ఆశ్చర్యానందాలతో ఉబ్బితబ్బిబ్బయిపోయింది ప్రణయ.

అన్ని రోజులూ సురేంద్ర తనతో ప్రేమతో మాట్లాడకపోలేదుగానీ ఇప్పుడు మరీ పిచ్చిగా తనతో గడపడం ప్రారంభించాడు. సాయంత్రం ఆఫీసు కాగానే స్నేహితులతో సరదాగా గడిపి రాత్రి ఎనిమిది గంటలకో, తొమ్మిది గంటలకో వస్తూంటే వాడు. ఇప్పుడు ఆరు గంటలకల్లా ఠంచనుగా ఇల్లు చేరుతున్నాడు. రాగానే మొహం కడుక్కుని, కాఫీలు అవీ అయ్యాక తనతో కబుర్లు వేసుకుంటున్నాడు. అత్తగారు ఏదైనా పని మీద తనను పిలిచినా "ప్రతీదానికీ దాన్ని పిలుస్తావెందుకని?" అని తల్లిని విసుక్కుంటున్నాడే తప్ప మునుపు లాగా కోడలిని నెత్తికెక్కించుకోవద్దని తల్లిని మందలించడం లేదు ఇప్పుడు.

'ఇదంతా మంత్ర ప్రభావమే!' అని మురిసిపోయింది ప్రణయ. రోజులు గడిచేకొద్దీ భర్త ప్రతీదానికీ తన అనుమతి కోరుతూ చివరికి కేవలం తన పాదాల దగ్గర బ్రతికే బానిసలా ప్రవర్తించడం చూసి ఎబ్బెట్టుగా



అనిపించి, తరువాత తరువాత భయమూ వేసింది. ఒక రోజున తల్లి వచ్చినప్పుడు ఆమెతో విషయమంతా చెప్పి "నాకేదో భయంగా ఉందమ్మా! దీనివలన నలుగురూ నన్ను చెడుగా అనుకుంటారేమో!" అని దిగులు పడింది.

"ఓసి పాపిష్టిదానా! ఇలాంటి పనిచేస్తే చెడ్డగా అనుకోక మెచ్చుకుంటారా! ఎందుకు పుట్టింది నీకీ పెడబుద్ధి?" అని కోప్పడింది ఆమె.

సురేంద్ర మంత్ర ప్రభావంతో మారిపోయాడని ఎప్పుడైతే భావించిందో అప్పుడే తన తల్లి కూడా తండ్రిని ఈ విధంగానే లొంగదీసుకుని ఉంటుందని నమ్మింది ప్రణయ. అందువలన తల్లి మాటలకు కోపం వచ్చి "అంతా నీ బుద్ధులే వచ్చాయి నాకు. నువ్వు నాన్నను అలా లొంగదీసుకున్న దానివే కదా!" అంది విసురుగా. తల్లి అవాక్కయింది.

కానీ చాటుగా అంతా వింటున్న సురేంద్రకు కోపం వచ్చి "నోర్ముయ్. చిన్నా పెద్దా అంతరం లేకుండా కన్న తల్లిని అంత మాట అంటావా?" అని కొట్టడానికి చేయి పైకెత్తి, తమాయించుకొని చరచరా వెళ్లిపోయాడు. మంత్ర ప్రభావంతో కుక్కిన పేనులా పడి ఉన్న భర్త ఇలా ప్రవర్తించడం చూసి బిత్తరపోయింది ప్రణయ. ఏదో తప్పు జరిగిందని అర్థమైందిగానీ ఏం జరిగిందో బోధపడలేదు.

★ ★ ★

ఆరోజు రాత్రి కాస్త ఆలస్యంగా ఇంటికి వచ్చిన సురేంద్రకు మంచంపై పడుకొని ఉన్న ప్రణయను చూస్తే జాలి వేసింది. ప్రక్కన కూర్చుని అనునయంగా చెప్పడం ప్రారంభించాడు.

"నువ్వు ఆ పాడు పత్రిక తెచ్చి బెడ్ క్రింద దాచి ఉంచడం చూసి అనుమానంతో దాన్ని చూశాను. ఆ తరువాత నీ పూజలూ అవీ చూశాక నువ్వు వశీకరణ పిచ్చిలో పడ్డావని అర్థమయింది. ఏం జరుగుతుందో చూద్దామని నేను నీకు వశమైనట్టు నటించాను. కానీ నువ్వు మీ అమ్మతో చెప్పి బాధ పడటం చూశాక నీకు ఏ దుర్బుద్ధీ లేదని తెలుసుకున్నాను. అయినా చదువుకున్నదానివి కదా! మంత్రాలకు చింతకాయలు రాలతాయని ఎలా నమ్మావు? అద్భుతశక్తులు గల ఉంగరాల గురించి కూడా పత్రికలలో ప్రకటనలు వస్తూంటాయి. అదీ నమ్ముతావా? భర్తను పూర్తిగా నీవాడిని చేసుకోవడానికి ఏ మంత్రమూ పనికిరాదు. నిజంగా నీకు ఆ కోరిక ఉంటే ఒకటే మంత్రం ఉంది. అది ఏమిటో తెలుసా? నువ్వు పూర్తిగా నీ భర్తను ప్రేమించటం ప్రారంభించు. పిచ్చిపిల్లా! అదీ ప్రేమమంత్రం. అదేనోయ్! ప్రణయ మంత్రం" అని భార్యను ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు.

అమాయకంగానే అయినా అందంగా నవ్వింది ప్రణయ.